
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

నారాయణపేట జిల్లా వార్తలు

గురువారం 29 ఆగస్టు 2024

ఉష్ణోగ్రతలు గరిష్ఠం: 29.0 కనిష్ఠం: 23.0



రూ.3 కోట్ల విలువైన సీలింగ్ భూమి స్వాహా

స్థానికంపై.. కమలం గురి

- పార్లమెంట్ ఓట్లను కేడర్‌గా మలుచుకునేందుకు ప్రణాళిక
- పార్టీ సభ్యత్వ నమోదును అస్త్రంగా ఎంచుకొని ముందుకు..
- గ్రామాల్లో బలోపేతం చేయట్లేదని నాయకత్వంపై అపవాదు
- దాన్ని పోగొట్టుకుని.. గ్రామీణ ప్రాంతాల్లో పట్టుకు ప్రయత్నం
- రాష్ట్రంలో అధికారంలోకి రావాలనే ఎత్తుగడలో భాగం



మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యశాలలో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ(ఫైల్)

మహబూబ్‌నగర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'రాష్ట్రంలో మీకు నచ్చిన పార్టీకి ఓటేశారు.. ఇప్పుడు జరుగుతున్నవి దేశం ఎన్నికలు.. మోదీ ఎన్నికలు... దేశం కోసం, ధర్మం కోసం కమలం పువ్వు గుర్తుకు ఓటేయండి.' అని పార్లమెంట్ ఎన్నికల ముందు బీజేపీ నాయకత్వం ప్రచారం చేసింది. అయితే వారు అనుకున్నట్లుగా రాష్ట్రంలో అధికార కాంగ్రెస్‌తో సమానంగా రెండు సీట్లు.. అసెంబ్లీ ఎన్నికల్లో కనీసం డిపాజిట్లు దక్కకపోయినా.. పార్లమెంట్ ఎన్నికల్లో పాలమూరులో ఒక స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకుంది. నాయకత్వం అనుకున్న ఫార్ములా సక్సెస్ అయ్యింది. ఉత్తర భారతదేశంలో సీట్లు తగ్గినా.. ఇక్కడ ఎక్కువ సీట్లు రావడం బీజేపీకి అధికారం నిలబెట్టుకోవడాన్ని సులభతరం చేసిందని చెప్పొచ్చు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో ప్రచార సరళిని బీజేపీ నాయకత్వం పూర్తిగా మార్చేసింది. ఓట్లను కేడర్‌గా మార్చుకునేందుకు రంగం సిద్ధం చేసుకుంటుంది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ ఆధ్వర్యంలో స్థానిక ఎన్నికల కోసం వ్యూహాలు రచిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మెజారిటీ గ్రామాలు, వార్డులు కైవసం చేసుకోవాలనే దిశగా అడుగులు వేస్తున్నారు. డీకే అరుణ పాలమూరులో పర్యటించినప్పుడల్లా.. స్థానిక సంస్థల అంశాన్ని కేడర్‌లోకి తీసుకువెళ్లే ప్రయత్నాలు చేస్తున్నారు. మక్తల్, నారాయణపేట, గద్వాల, మహబూబ్‌నగర్, కొడంగల్ నియోజకవర్గాల్లో ఇప్పటికే ఒక రోడ్ మ్యాప్ తయారు చేసుకుని ముందుకు సాగుతున్నారు. త్వరలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానంలోని మిగతా నియోజకవర్గాలతో పాటు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలో కూడా విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నారు. ఇప్పుడు దేశం కోసం.. మోదీ కోసం కాకుండా డబుల్ ఇంజిన్ సర్కారు రాష్ట్రంలో అధికారంలోకి రావడం ధ్యేయంగా ప్రచార శైలి కొనసాగనుంది. దేశంలో పార్టీ మూడోసారి అధికారంలోకి రావడం, రాష్ట్రంలో ఎనిమిది అసెంబ్లీ స్థానాలు, ఎనిమిది పార్లమెంట్ స్థానాలను ప్రజలు కట్టబెట్టడంతో పూర్తి జోష్ మీదున్న పార్టీ.. గ్రామీణంలో కూడా పట్టును సాధించేందుకు ఉవ్విళ్లూరుతోంది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన సీట్లలో కూడా ఎక్కువగా గ్రామీణ ప్రాంత నియోజకవర్గాలే కావడంతో తాము కచ్చితంగా కేడర్‌ను బలోపేతం చేస్తే అధికారం చేపట్టడం ఖాయమనే భావనలో బీజేపీ నాయకత్వం ఉన్నట్లు తెలుస్తోంది.

సభ్యత్వ నమోదు అస్త్రంగా..

పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్నడూ లేనంతగా బీజేపీ ఓట్ల షేరింగ్ పెరిగింది. అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో కేవలం 6.82 శాతం సాధించిన బీజేపీ.. పార్లమెంట్ ఎన్నికల్లో ఏకంగా 31.58 శాతం ఓట్లను దక్కించుకుంది. దాదాపు 34.76 శాతం ఓట్లను పెంచుకుని విజయకేతనం ఎగురవేసింది. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో కూడా అసెంబ్లీతో పోల్చితే లోక్‌సభలో 24.33 శాతం ఓట్లను పెంచుకుంది. అయితే అప్పటికే కాంగ్రెస్‌ను రాష్ట్రంలోకి తెచ్చిన ప్రజలు.. బీఆర్‌ఎస్ ఓట్లను గంపగుత్తగా బీజేపీకి వేశారు. కాంగ్రెస్ రెండు పార్లమెంట్‌ల్లోనూ ఓట్ల శాతాన్ని అసెంబ్లీతో పోల్చితే పెంచుకుంది. అప్పుడు మోదీ, కేంద్రం, హిందుత్వ ఆలోచనల్లో భాగంగా బీజేపీకి ఓటువేయగా.. అదే పరంపరను స్థానికంలో కూడా కొనసాగించాలని నాయకత్వం భావిస్తోంది. ఇందుకోసం సభ్యత్వ నమోదును అస్త్రంగా ఎంచుకుని కార్యాచరణ ప్రణాళికలు చేసుకుంటోంది. కాంగ్రెస్ నాయకులు పలు నియోజకవర్గాల్లో వివాదాలకు దిగుతుండగా, కొన్ని నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతంపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కేవలం ప్రభుత్వ కార్యక్రమాలకే పరిమితం అవుతుండటంతో చాపకింద నీరులా బీజేపీ తన విస్తరణ ఏర్పాట్లను చేసుకుంటోంది. సభ్యత్వ నమోదు కార్యక్రమం- 2024 కార్యశాల పేరిట కార్యక్రమాలను నిర్వహిస్తోంది. పార్లమెంట్ ఎన్నికల్లో పడిన ఓట్లను కేడర్‌గా మలుచుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. యువ కార్యకర్తలను ఈసారి ఎక్కువగా స్థానిక సంస్థల్లో నిలబెట్టే అవకాశం ఉన్నట్లు స్పష్టమవుతోంది. కొద్దోగొప్పో పాత కేడర్ ఉన్నప్పటికీ.. యువ రక్తాన్ని జోడించడం ద్వారా ఎక్కువ స్థానాలను కైవసం చేసుకోవచ్చనే ఎత్తుగడతో పార్టీ పని చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. వారైతేనే భవిష్యత్‌లో కూడా పార్టీ నిర్మాణం.. బలోపేతంలో కీలకపాత్ర పోషిస్తారనే అభిప్రాయంతో నాయకత్వం ఉంది.

గ్రామీణ ప్రాంతాల్లో కేడర్ కోసం..

సాధారణంగా ప్రతీ ఎన్నికల్లో బీజేపీకి ఎక్కువగా పట్టణ ప్రాంత ప్రజలు ఓటు వేయడం గమనిస్తుంటాం. పట్టణ ప్రాంతాల్లో కేడర్ కొంత బలంగా ఉండటం, బీజేపీ, సంఘ్ విధానాలకు ఎక్కువగా ఆకర్షితులు కావడం మూలంగా ఎక్కువ ఓట్లు వస్తాయి. అదే గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీకి ఓట్లు, సీట్లు రావడం గగనం. అందుకు కేడర్ లేకపోవడం, ఉన్నా సామర్థ్యం లేకపోవడం కారణాలుగా చెప్పొచ్చు. అయితే గడిచిన పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి గ్రామీణ ప్రాంతాల్లోనూ భారీగా ఓట్లు పడ్డాయి. కానీ అవి దేశం, మోదీ ఎన్నిక కోసం పడ్డాయనేది సుస్పష్టం. ఎందుకంటే అంతకుముందు జరిగిన ఎన్నికల్లో బీజేపీకి అవే గ్రామీణ ప్రాంతాల్లో ఓట్లు రాకపోవడం ఉదాహరణగా చెప్పొచ్చు. బీజేపీ నాయకత్వం కూడా పట్టణ ప్రాంతాల్లోనే ఎక్కువగా దృష్టి కేంద్రీకరిస్తుందనే అపవాదు గతంలో నుంచి ఉంది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం బీజేపీ తన పంథాను మార్చుకుంది. బీజేపీ, సంఘ్, హిందుత్వవాదులను గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఏకం చేసేందుకు స్థానిక ఎన్నికలపై గురి పెట్టింది. గత ఎన్నికల సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో కీలకంగా పని చేసిన కార్యకర్తలకు బాధ్యతలు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ప్రతీ బూత్‌లో కనీసం 75 శాతం బీజేపీ సభ్యత్వాలు ఉండేలా కార్యాచరణను సిద్ధం చేస్తోంది. స్థానిక సంస్థల్లో గెలవాలన్నా, నాయకులకు.. కార్యకర్తలకు పదవులు రావాలన్నా సభ్యత్వ నమోదును పెంచాలని సూచిస్తోంది.

- ఆ భూమికి ఇటు ఎమ్మెల్యే కార్యాలయం.. అటు వంద పడకల ఆస్పత్రి
- ఫలితంగా దానిపై కన్నేసిన వ్యక్తి
- అందులో ఇల్లు ఉన్నట్లు సృష్టించి రిజిస్ట్రేషన్
- కళ్లెదుటే జరిగినా చర్యలకు వెనుకాడుతున్న అధికారులు



వంద పడకల ఆస్పత్రి పక్కన కబ్జాకు గురైన సీలింగు ల్యాండు ఇదే..

అలంపూర్ చౌరస్తా, ఆగస్టు 28: సీలింగ్ భూమిని ప్లాటుగా మార్చి రిజిస్ట్రేషన్ ద్వారా స్వాహా చేసిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇటు అధికారులు, అటు అనుభవదారులపై సామ బేద దాన దండోపాయలను అమలు చేసి, రూ.మూడు కోట్ల విలువైన భూమిని కారు చౌకగా కొట్టేశాడు.

ప్లాటుగా మార్చి..

1970-1971లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు సీలింగ్ భూములను పంపిణీ చేసిన విషయం తెలిసిందే. అందులో భాగంగా అలంపూర్ పట్టణానికి చెందిన హుసేన్‌బీ కుటుంబానికి ఉండవల్లి మండలం పుల్లూరు గ్రామ శివారులోని అలంపూర్ చౌరస్తాలో సర్వే నెంబరు 273లో నాలుగు ఎకరాలా 33 గుంటల భూమిని కేటాయించారు. చట్టం ప్రకారం సీలింగ్ భూములను ఇతరులకు అమ్మొద్దు, కొనొద్దు. ఆ భూమిని తల్లి నుంచి వారసత్వంగా కుమారుడు షఫియుల్లాకు 2018లో అప్పటి తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేశారు. అలంపూర్ చౌరస్తాలోని భూములకు, ఇంటి స్థలాలకు రికార్డు ధరలు పలుకుతున్నాయి. సెంటు భూమి రూ.10 లక్షల నుంచి రూ.కోటి వరకు ధర పలుకుతోంది. ఇక్కడ రాష్ట్రంలోని ఏకైక శక్తిపీఠం జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే రెండు వరుసల రహదారితోపాటు, 44వ జాతీయ రహదారి ఉండటం, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల ప్రారంభ సరిహద్దు ప్రాంతం కావడం, కర్నూలు జిల్లా ఓర్వకల్లులో ఉన్న విమానాశ్రయానికి అలంపూర్ చౌరస్తా అతి చేరువలో ఉండటంతో ఇక్కడి భూముల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఈ భూమి పక్కనే వంద పడకల ఆస్పత్రి, ఎమ్మెల్యే కార్యాలయం, విద్యా సంస్థలు ఉండటంతో ఇక్కడ ఉండే ఓ పేరుమోసిన వ్యక్తి కన్ను దీనిపై పడింది. అది సీలింగ్ భూమి కావడంతో రిజిస్ట్రేషన్ ఆషామాషీ కాదని ఆర్థిక, అంగబలంతో యాజమానులకు సొమ్ము ఎరగా వేసి, 14.5 సెంట్ల స్థలాన్ని తక్కువకు సొంతం చేసుకున్నాడు.

అసిస్మెంట్ ద్వారానే రిజిష్టర్ చేశాం

ఈ విషయమై గతంలో అలంపూర్ సబ్ రిజిస్ట్రార్‌గా పని చేసి, బదిలీపై గద్వాల్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లిన సబ్ రిజిస్ట్రార్ ముజాహీర్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. కేవలం అసిస్మెంట్ ఆధారంగానే అలంపూర్ చౌరస్తాలోని సర్వే నెంబరు 273ఆ/1లో గల 693.33 చదరపు గజాల ప్లాటును రిజిష్టర్ చేశామన్నారు. ఇది సీలింగ్ భూమి అనే విషయం తనకు తెలియదని, అక్కడ ఇల్లు ఉందా? లేదా? అనే విషయాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసే అధికారం తమ శాఖకు లేదని తెలిపారు.

అలా రిజిష్టర్ చేసే అధికారం లేదు

నేను ఈ మధ్యనే చార్జ్ తీసుకున్నాను. ఈ విషయం మీ ద్వారే తెలుసుకున్నా. రికార్డు వెరిఫై చేశాను. సర్వే నెంబరు వేసి, రిజిష్టర్ చేశారు. వాస్తవంగా అలా చేయకూడదు. ఇంటి తాలూకు ఖాళీ స్థలం అన్నప్పుడు కేవలం ఇంటి నెంబరు ఆధారంగానే రిజిష్టర్ చేయాల్సి ఉంటుంది. అసిస్మెంట్ ఆధారంగా రిజిష్టర్ చేసే అధికారం ఎక్కడా లేదు. ఓనర్‌షిప్ సర్టిఫికెట్‌తో మాత్రమే రిజిష్టర్ చేయొచ్చు. అలా ఎందుకు చేశారో నాకే అర్థం కావడం లేదు. ఇక్కడే ఇలా చేస్తున్నారని తెలిసింది. నేనైతే ఇలా చేసేదాన్ని కాదు.

- జి. మౌనిక అలంపూర్ సబ్ రిజిస్ట్రార్ అధికారి

ఇల్లు ఉన్నట్లు రిజిస్ట్రేషన్ చేయించి..

అప్పటి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ఇళ్లకు నెంబర్లు కేటాయించి, పన్నులు వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే అదనుగా భావించిన అతను సామ బేద దాన దండోపాయలతో పంచాయతీ కార్యదర్శిని సంప్రదించాడు. సర్వే నెంబరు 273ఆ/1లోని సీలింగ్ వ్యవసాయ భూమి 14.5 సెంట్లలో గతంలోనే ఇల్లు నిర్మించినట్లు(ప్రస్తుతం శిథిలవస్థలో ఉన్నట్లు) అసిస్మెంట్ (1728) ద్వారా 14-42-ఏ నంబరును పొందాడు. అలంపూర్ రిజిస్ట్రేషన్ కార్యాలయ దస్తావేజు లేఖరి చేతులు తడిపి, 14.5 సెంట్లలో శిథిలమైన ఇల్లు, స్థలం ఉన్నట్లు సబ్ రిజిస్ట్రార్ ద్వారా ఈ ఏడాది ఫిబ్రవరి ఆరున(డాక్యుమెంటు నెంబరు 210/2024) రిజిష్టర్ చేశారు. అసిస్మెంట్ అనేది యజమాని ధ్రువీకరణ పత్రం కాదని, 11/11/2020న తెలంగాణ హైకోర్టు స్పష్టంగా తీర్పును ఇచ్చింది. కానీ దీనిని అలంపూర్ సబ్ రిజిష్టర్ కార్యాలయ అధికారులు బుట్టదాఖలు చేశారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులతో 'ఆంధ్రజ్యోతి' క్షేత్రస్థాయిలో పరిశీలించగా ఆ భూమిలో ఏపుగా పెరిగిన కంపచెట్లు తప్ప ఎలాంటి కట్టడాలు కానీ, ఇంటి నిర్మాణాలు కానీ కనిపించలేదు. కబ్జాకు గురైన సీలింగ్ భూమి విలువ సుమారు రూ.మూడు కోట్లు ఉంటుందని అంచనా. రిజిస్ట్రేషన్ చేయించుకున్న వ్యక్తి తన వృత్తిలో భాగంగా అధికారులతో సత్సంబంధాలు కలిగి ఉండటంతోనే ఇదంతా సాధ్యమైందని తెలుస్తోంది. ఇతను గతంలో కూడా చాలా చోట్ల అధికారులను, భూ యజమానులను బెదిరించి వివాదాస్పద భూములను కబ్జా చేసేందుకు యత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ భూమి కబ్జాకు గురవుతున్నా స్థానిక అధికారులకు తెలియకపోవడం చర్చనీయంశంగా మారింది.

సైబర్ ఉచ్చులో ప్రైవేటు ఉద్యోగి

- రూ.1.94 లక్షలు లూటీ చేసిన నేరగాళ్లు

అలంపూర్ చౌరస్తా, ఆగస్టు 28: జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం కలుగొట్ల గ్రామానికి చెందిన ప్రైవేటు ఉద్యోగి హనుమంతు సైబర్ ఉచ్చులో పడి, రూ.1.94 లక్షలు నష్టపోయాడు. వివరాల్లోకి వెళితే.. హనుమంతు ఓ ప్రైవేటు షోరూంలో పని చేస్తున్నాడు. గత జూలై 30న తన మొబైల్‌కు టెలిగ్రామ్‌లో వర్క్ ఫ్రం హోమ్ అని వచ్చిన ఓ లింకు క్లిక్ చేశాడు. దాంతో లాగిన్ ఐడీ క్రియేట్ అయ్యింది. అందులో టాస్క్ కంప్లీట్ చేయాలని, ముందుగా కొంత డబ్బు డిపాజిట్ చేయాలని ప్రొత్సహించారు. అలా విడతల వారీగా ఈ నెల 21 వరకు వివిధ అకౌంట్ల ద్వారా రూ.1,94,844 జమ చేసుకుంటూ వచ్చాడు. ఆ డబ్బులు తిరిగి రాకపోవడంతో మోసపోయానని గ్రహించి, సైబర్ క్రైంకు ఫిర్యాదు చేశాడు. బాధితుడిని విచారించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి తెలిపారు.

క్రీడా రత్నాలు

- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న ఉమ్మడి జిల్లా క్రీడాకారులు
- వరల్డ్ వాలీబాల్ యూనివర్సిటీ టోర్నీలో పాల్గొన్న మక్తల్‌కు చెందిన అనన్యశ్రీ
- 8 బంగారు పతకాలు సాధించిన అన్నాసాగర్‌కు చెందిన హారికా దేవి
- 2023-24లో ఉమ్మడి జిల్లా నుంచి 90 మంది జాతీయ స్థాయికి..
- నేడు జాతీయ క్రీడా దినోత్సవం



జడ్చర్లలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17 ఫుట్‌బాల్ పోటీల్లో గెలుపొందిన మహబూబ్‌నగర్ బాలుర జట్టు(ఫైల్)

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 28: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతున్నారు. మౌలిక సదుపాయాలు, సరైన మైదానాలు లేకున్నా, శిక్షకుల కొరత ఉన్నా ఆటల్లో రాణిస్తున్నారు. కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా సంఘాల ప్రోత్సాహంతో గ్రామీణ స్థాయి నుంచి వెలుగులోకి వస్తున్నారు. పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్)తో పాటు వివిధ క్రీడా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నీల్లో ఉమ్మడి జిల్లా జట్లు సత్తా చాటాయి. పలు రాష్ట్ర స్థాయి టోర్నీలకు, ఎస్‌జీఎఫ్ పోటీలకు మహబూబ్‌నగర్ జిల్లా ఆతిథ్యమిచ్చింది. అందుకే మహబూబ్‌నగర్‌ను క్రీడాకారుల ఖిల్లాగా పేర్కొంటారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి నేపథ్యంలో నేడు క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా క్రీడాకారులపై ప్రత్యేక కథనం..

బ్యాట్ పడితే పరుగుల వరదే..

ఉమ్మడి జిల్లాలోని మరికల్‌కు చెందిన గణేశ్ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తున్నాడు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే 3డే, 2డే లీగ్ టోర్నీలతో పాటు ఎస్‌జీఎఫ్ పోటీల్లో రాణించాడు. హైదరాబాద్‌లో నిర్వహించిన 3డే లీగ్ పోటీల్లో తెలంగాణ కంబైన్డ్ జిల్లాల జట్టులో చోటు దక్కించుకున్నాడు. గత ఏడాది జూలై 2022-23 సీజన్‌లో జరిగిన హెచ్‌సీఏ జోనల్స్ టోర్నీలో తెలంగాణ కంబైన్డ్ జిల్లాల జట్టు తరఫున రెండు మ్యాచ్‌లో 287 పరుగులు చేడంతో పాటు రెండు వికెట్లు తీశాడు. ఇన్‌కం టాక్స్ శాఖ జట్టుపై 104 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 61 పరుగులు చేశాడు. ఇండియన్ సిమెంట్ జట్టుపై 44 పరుగులు చేశాడు. ఎవర్‌గ్రీన్ జట్టుపై 36 పరుగులు చేసి, ఒక వికెట్ తీశాడు. యూటీఐ జట్టుపై 33 పరుగులు, ఈస్ట్‌మారెడ్‌పల్లి జట్టుపై తొమ్మిది పరుగులు చేసి, ఒక వికెట్ తీశాడు. 2020లో నిర్వహించిన 3డే లీగ్‌లో ఎనిమిది మ్యాచులలో 609 పరుగులు చేసి, ఆరు వికెట్లు పడగొట్టాడు. ఇదే ఏడాది నిర్వహించిన 2డే లీగ్‌లో జిల్లా జట్టు తరఫున ఆడి రాజు జట్టుపై 318(ట్రీపుల్ సెంచరీ నాటౌట్) పరుగులు చేశాడు. అదే ఏడాది జరిగిన డబ్ల్యూసీసీ జట్టుపై మరో 329(మరో ట్రీపుల్ సెంచరీ) పరుగులు సాధించి సరికొత్త చరిత్ర సృష్టించాడు. 2021లో నిర్వహించిన 3డే లీగ్ ఆరు మ్యాచ్‌ల్లో 228 పరుగులు, 11 వికెట్లు తీసి, ప్రతిభ చాటాడు.



గణేశ్

ఎస్‌జీఎఫ్‌లో రాణింపు

పాఠశాల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో 2023-24లో ఉమ్మడి జిల్లా నుంచి 90 మంది బాల, బాలికలు జాతీయ స్థాయికి ఎదిగారు. ఉమ్మడి జిల్లాలో గత విద్యా సంవత్సరం ఎనిమిది రాష్ట్ర స్థాయి టోర్నీలకు ఆతిథ్యమిచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్‌లో వాలీబాల్ అండర్ 17 బాల, బాలికల టోర్నీ, జడ్చర్లలో అండర్ 17 బాలుర ఫుట్‌బాల్ రాష్ట్ర స్థాయి టోర్నీ, మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్‌లో అండర్ 17 బాల, బాలికల హ్యాండ్ బాల్ టోర్నీ నిర్వహించారు. అండర్-14 క్రికెట్ రాష్ట్ర స్థాయి టోర్నీని జడ్చర్లలో నిర్వహించారు. గద్వాలలో రెండు రాష్ట్రస్థాయి టోర్నీలు జరిగాయి. ఫుట్‌బాల్ అండర్ 14 బాలుర, క్రికెట్ అండర్ 17 టోర్నీలు నిర్వహించారు. వనపర్తిలో రాష్ట్రస్థాయి అండర్ 17 హాకీ, అండర్ 17 ఖోఖో, అండర్ 14 బాలికల ఫుట్‌బాల్ పోటీలు జరిగాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలో అండర్ 14, 17 మాల్‌ఖంబ్ పోటీలు నిర్వహించారు. నారాయణపేట జిల్లాలో అండర్-17 వాలీబాల్ పోటీలు నిర్వహించారు. పలు టోర్నీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి, ఛాంపియన్లుగా నిలిచారు.

వాలీబాల్‌లో సత్తాచాటిన అనన్యశ్రీ..



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మక్తల్‌కు చెందిన అనన్యశ్రీ వాలీబాల్‌లో సత్తా చాటుతోంది. గత ఏడాది ఆగస్టు చైనాలో నిర్వహించిన వరల్డ్ వాలీబాల్ యూనివర్సిటీ టోర్నీలో ఆలిండియా యూనివర్సిటీ జట్టు తరఫున పాల్గొంది. కేరళ యూనివర్సిటీలో బీకాం పూర్తిన ఈమె 2018 పంజాబ్, 2019 తమిళనాడు, 2020 ఏపీ, 2022 ఉత్తరాఖండ్, మహరాష్ట్రలో నిర్వహించిన జాతీయ స్థాయి జూనియర్ వాలీబాల్ టోర్నీల్లో కేరళ జట్టు తరఫున ప్రతిభ చాటింది. 2023లో అస్సాంలో నిర్వహించిన సీనియర్ వాలీబాల్ నేషనల్ టోర్నీ, పాండిచ్చేరిలో నిర్వహించిన ఫెడరేషన్ కప్‌లో సత్తా చూపించింది. ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన ఆల్‌ఇండియా ఉమెన్స్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నీలో పాల్గొని, బంగారు పతకం సాధించింది. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో ఉద్యోగం సాధించిన అనన్యశ్రీ పూణెలో క్లర్క్‌గా పనిచేస్తోంది.

ఒలింపిక్స్ ట్రయల్స్ వరకు..



నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం అన్నాసాగర్‌కు చెందిన హారికా దేవి 2024 జూన్‌లో హరియాణాలో నిర్వహించిన ఒలింపిక్స్ ట్రాయల్స్‌లో పాల్గొంది. కొద్దిలో ఒలింపిక్స్ ఆడే అవకాశం కోల్పోయింది. 100 మీటర్ల పరుగులో తన నైపుణ్యాన్ని కనబరచినా, అవసరమైన టైమింగ్ రాకపోవడంతో అవకాశం చేజారింది. ప్రస్తుతం నారాయణపేటలో అథ్లెటిక్స్ ఖేలో ఇండియా కేంద్రంలో చిన్నారులకు శిక్షణ ఇస్తోంది. ఇప్పటి వరకు 48 జాతీయ స్థాయి టోర్నీల్లో పాల్గొన్న హారిక 18 పతకాలు సాధించింది. అందులో ఎనిమిది గోల్డ్ పతకాలు రావడం విశేషం. సుమారు 90 వరకు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ 100 మీటర్లు, 200 మీటర్ల పరుగులో పాల్గొంటోంది. భవిష్యత్తులో కామన్ వెల్త్ పోటీల్లో పాల్గొని దేశానికి పతకం సాధించడమే లక్ష్యంగా పెట్టుకుంది.

మెరుగైన వైద్య సేవలు అందించాలి


- కలెక్టర్ సిక్తా పట్నాయక్



చిన్న పిల్లల ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట టౌన్/కోస్గి/మద్దూర్, ఆగస్టు 28 : ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ పేర్కొన్నారు. బుధవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని చిన్న పిల్లల ఆసుపత్రితో పాటు కోస్గి ప్రభుత్వ ఆసుపత్రి, మద్దూర్‌లోని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్న పిల్లల ఆసుపత్రిలో ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురు చిన్నారులు చికిత్స పొందుతుండడంతో ఎందుకు ఇలాంటి పరిస్థితి ఉందని అడిగారు. ఆసుపత్రిలోని ఓ వార్డును జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులు క్యాంటీన్ కోసం తీసుకోవడం జరిగిందని, ఆసుపత్రిలో మంచాల కొరత ఉందని ఇన్‌చార్జి సూపరింటెండెంట్ మల్లికార్జున్ కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ స్పందిస్తూ వెంటనే క్యాంటీన్ గదిని తీసుకోవాలన్నారు. ఆసుపత్రికి వచ్చిన రోగుల బంధువులు మందులు బయట తెచ్చుకుంటున్నామని చెప్పడంతో ఏఏ మందుల కొరత ఉందో తనకు తెలపాలని కలెక్టర్ ఆదేశించారు. కోస్గి ప్రభుత్వ ఆసుపత్రిలో మందుల కొరత ఉందని, సమయానికి మందులు అందడం లేదని సిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కలెక్టర్ స్పందిస్తూ సిబ్బంది కొరత కూడా ఉంటే ఈ రెండింటిపై తనకు నివేదిక పంపాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనుదీప్‌కు సూచించారు. అంతకుముందు మద్దూర్ కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన మంగమ్మ అనే మహిళ మందులు బయటకు రాస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసురాగా స్పందించిన కలెక్టర్ మందుల కొరత లేకుండా ముందుగానే అవసరమైన మందుల ఇండెంట్‌ను ఉన్నత అధికారులకు పంపించాలని సూచించారు.





జాతీయ స్థాయి పోటీలకు

కొల్లాపూర్ విద్యార్థుల ఎంపిక

కొల్లాపూర్, ఆగస్టు 28 : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న బీఏ మూడవ సంవత్సరం విద్యార్థిని గడ్డం రాజేశ్వరి ఇటీవల ఎస్ఎండీసీ హైదరాబాద్ ఆధ్వర్యంలో జరిగిన మారథాన్ రాష్ట్ర స్థాయి 10 కి.మీ. పరుగుపందెంలో రన్నర్‌గా నిలిచి సిల్వర్ మెడల్ సాధించి రూ.15వేలు నగదు బహుమతి పొందింది. 41 కి.మీ రిలే పరుగు పందెంలో రాజేశ్వరి జాతీయ స్థాయికి ఎంపికైంది.

అదేవిధంగా ఈ కళాశాలలో బీఏ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి అరవింద్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ కల్వకుర్తి సీబీఎం కళాశాలలో జరిగిన ఒక కి.మీ పరుగు పందెంలో ప్రథమస్థానంలో గెలుపొంది రాష్ట్ర స్థాయి పోటీకి ఎంపికయ్యారు. జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్ అభినందిస్తు ఇదే స్ఫూర్తితో జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కళాశాల ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్ డా.రమేష్‌కుమార్ మాట్లాడుతూ అరకొర సౌకర్యాలు గల మారుమూల ప్రాంతం నుంచి కఠోర శ్రమతో జాతీయ స్థాయికి ఎదిగిన క్రీడాకారులకు మన ప్రాంత ఆణిముత్యాలుగా అభివర్ణించారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న డిగ్రీ కళాశాల అధ్యాపకులు



చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 28 : రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతి చెందాడు. పెద్దకొత్తపల్లి ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కల్వకోల్, కోడేరు మండలం కొండ్రావుపల్లి మధ్య మంగళవారం ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్నాయి. ప్రమాదంలో కొండ్రావుపల్లి గ్రామానికి చెందిన జక్కుల ప్రదీప్(29) తలకు బలమైన రక్తగాయాలు కాగా వెనక కూర్చున్న జక్కుల విష్ణుకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. జక్కుల ప్రదీప్ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని కేర్ ఆసుపత్రికి తరలించారు. కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం ప్రదీప్ మృతి చెందాడు. ఘటనపై మృతుడి భార్య విజయలక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కారు, బైకు ఢీకొని యువకుడి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, ఆగస్టు 28 : కారు, బైక్ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని వనపట్ల శివారులో చోటు చేసుకుంది. ఎస్సై గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని దేశిటిక్యాలకు చెందిన వెంకటకృష్ణయ్య(39) బుధవారం తెలకపల్లి మండలం పెద్దూరు గ్రామంలో బోనాల పండుగ కోసం బైక్‌పై వెళ్తుండగా వనపట్ల శివారులో ప్రమాదవశాత్తు కారు ఢీకొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, ఆగస్టు 28 : ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని ఉయ్యాలవాడ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కాకునూరి రాముడు(38) బుధవారం గ్రామ సమీపంలోని ఎర్రగుంట్లబావి వద్ద స్నానం చేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఘటనపై మృతుడి అన్న కాకునూరి బచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎక్సైజ్ దాడులు, ముగ్గురి అరెస్టు

» 480 కిలోల నల్లబెల్లం స్వాధీనం

కల్వకుర్తిటౌన్, ఆగస్టు 28 : ఎక్సైజ్ దాడులు చేసి ముగ్గురిని అరెస్టు చేసి, 480 కిలోల నల్లబెల్లం స్వాధీనం చేసుకున్న సంఘటన బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి ఎక్సైజ్ పరిధిలో చోటు చేసుకుంది. ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్వకుర్తి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కల్వకుర్తి టీం, డీటీఎఫ్ నాగర్‌కర్నూల్ టీంల సంయుక్త ఆధ్వర్యంలో వెల్దండ మండలం నగరగడ్డ తండా, దుబ్బతండా, పోచమ్మగడ్డ తండాల్లోని నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. దాడుల్లో 600 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి ఓ వ్యక్తిని అరెస్టు చేసి, నాలుగు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని అధికారులు తెలిపారు. డీటీఎఫ్ నాగర్‌కర్నూల్ టీం ఆధర్వంలో కల్వకుర్తి మండలం ఎల్లికల్‌తండాలో నల్లబెల్లం నిల్వ ఉంచిన స్థావరంపై దాడులు నిర్వహించి 16 బస్తాల్లో ఉన్న సుమారు 480 కిలోల నల్లబెల్లం, 20 కిలోల పటిక, నాలుగు లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి, డీటీఎఫ్ సీఐ రాజ్యలక్ష్మీ, సిబ్బంది రఘు, మాధవి, మహేష్ పరశురాం, నార్యా, తిరుపతిరెడ్డి, రవీందర్ ఉన్నారు.



సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు













ఆముదం పంట పరిశీలన



వటవర్లపల్లిలో ఆముదం పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మన్ననూర్, ఆగస్టు 28 : నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరు, వటవర్లపల్లి, వెంకటేశ్వర్లబావి గ్రామాల్లోని ఆముదం పంట ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రాలను పాలెం వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.నళిని, డాక్టర్ ఈశ్వర్‌రెడ్డి, డాక్టర్ వి.దివ్యరాణీలు బుధవారం పరిశీలించారు. పీసీహెచ్-596 మొదటి సంవత్సరం చిరు పంటలను వారు పరిశీలించారు. వివిధ దశలో ఆముదం పంటకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. వేరే రకం విత్తనాలతో వచ్చే దిగుబడితో పోల్చినపుడు పీసీహెచ్-596 రకంతో వచ్చే పత్తిచేలకు ఆముదం గెలల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు రైతులు శాస్త్రవేత్తల ముందు సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆముదం పంటలకు నల్లమల అనువైన ప్రాంతమని, ఆముదం కాయలను కోతులు తెంచేయవని శాస్త్రవేత్తలు అన్నారు. రైతులు ఆముదం పంట సాగుపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవో సీతారాంనాయక్ , ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పీయూ విద్యార్థినికి డాక్టరేట్



తంగాలపల్లి స్వాతికి పీహెచ్‌డీ పత్రాలను అందజేస్తున్న ఎగ్జామినర్ డాక్టర్ శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నూర్జహాన్‌బేగం

పాలమూరు యూనివర్సిటీ, ఆగస్టు 28 : పాలమూరు యూనివర్సిటీ విద్యార్థిని తంగాలపల్లి స్వాతి డాక్టరేట్ సాధించారు. బుధవారం పాలమూరు యూనివర్సిటీలో రసాయన శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వాతికి డాక్టరేట్ పట్టాను అందజేశారు. హైదరాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) సైంటిస్ట్, సీనియర్ ప్రిన్సిపాల్ అయిన డాక్టర్ శ్రీధర్ ఎగ్జామినర్‌గా ఆధ్వర్యంలో జరిగిన ఫైనల్ వైవావోయిస్ నిర్వహించారు. అన్ని రకాల పరీక్షలు నిర్వహించి పీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, ఫార్మసి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నూర్జహాన్‌బేగం, అదనపు పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ విజయలక్ష్మితో కలిసి స్వాతికి డాక్టరేట్ పత్రాలను అందజేశారు. స్వాతి పీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్ పర్యవేక్షణలో 'ప్రిపరేషన్, స్ట్రక్చరల్ క్యారెక్ట్రైజేషన్ అండ్ అప్లికేషన్ ఆఫ్ ట్రాన్సెంట్ స్పెషస్ ఆఫ్ డీఎంఏపీ అండ్ సింథసీస్ ఆఫ్ సమ్ ఇంపార్టెంట్ స్కాఫల్డ్స్ బై ఎంప్లాయింగ్ ఆక్వాయస్ ఫెస్‌నోవెతగేల్ కాండెన్సేషన్ అండ్ మల్టీకంపోనెంట్ రియాక్షన్స్ (డీఎంఏపీ 4 -డైమెథైలమినో పైరిడిన్) (మొక్క తాత్కాలిక జాతుల వివిధ కార్బనిక చర్యలలో కీలకపాత్ర దృగ్విషయం వాటి రసాయన చర్యశీలతను అర్థం చేసుకోవడానికి అవసరం) అనే అంశంపై తంగాలపల్లి స్వాతి పీహెచ్‌డీని పూర్తి చేశారు. ఆమె చేసిన పీహెడీ పత్రాలు అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. జిల్లా కేంద్రంలోని వెంటేశ్వరకాలనీకి చెందిన స్వాతి తెలంగాణ యూనివర్సిటీలో పీజీలో గోల్డ్ మెడల్ సాధించి ఇన్‌స్పైర్ ఫెలోషిప్ ద్వారా పీయూ పీహెచ్‌డీ ప్రవేశం పొందారు. డాక్టరేట్ ప్రకటించడంతో కుంటుంబీకులు, అధ్యాపకులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



ట్రాక్టర్‌ను పట్టుకున్న పోలీసులు

గోపాల్‌పేట, ఆగస్టు 28: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను మండల కేంద్రంలో పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... వనపర్తి జిల్లా గోపాల్ పేట మండల కేంద్రంలో బుధవారం ఉదయం ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ట్రాక్టర్ యాజమాని గొల్ల పుల్లయ్య, డ్రైవర్ శివపై కేసు నమోదు చేశామన్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

మిల్లు యజమాని ఆస్తి జప్తు



జప్తు చేసిన సామగ్రితో తహసీల్దార్ సుభాష్ నాయుడు సిబ్బంది

పాన్‌గల్,ఆగస్టు28: వనపర్తి జిల్లా పాన్‌గల్ మండల పరిధిలోని కేతేపల్లి గ్రామానికి చెందిన వెంటకసాయి రైస్ మిల్ యజమాని నరసింహులుకు చెందిన ఆస్తిని రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం జప్తు చేస్తున్నట్లు బుధవారం తహసీల్దార్ సుభాష్ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ చట్టం ప్రకారం యజమానికి సంబంధించిన ఒక టీవీ, రెండు ద్విచక్ర వాహనాలు, ఒక స్టాండ్ ఫ్యాన్ రికవరీ చేశామన్నారు. రికవరీ చేసిన ఆస్తిని భద్రత దృష్ట్యా స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అశోక్‌కుమార్, ఆర్ఐలు మహేష్, తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

31న శ్రీరంగనాయకస్వామి గుట్టపై పాటల పోటీలు

జడ్చర్ల, ఆగస్టు 28 : జడ్చర్ల మునిసిపాలిటీలోని బాదేపల్లి పాతబజారు సమీపంలోని రంగనాయకులగుట్టపై శ్రీరంగనా యకస్వామి దేవాలయం ప్రాంగణంలో ఈ నెల 31న పాటల పోటీలను నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కాల్వ రాంరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల 30నిమిశాలకు పోటీలను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. మన గుడి మన బాధ్యత అనే నినాదంతో లక్ష అడగుల సంకల్పంలో భాగంగా విద్యార్థినీ, విద్యార్థులకు పాటల పోటీలను నిర్వహించను న్నట్లు పేర్కొన్నారు. దైవభక్తి, దేశభక్తి పాటలు పాడాలని, జూనియర్స్, సబ్‌జూనియర్స్, సీనియర్స్ విభాగాలుగా విభజించి పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. బహు మతులను అందచేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బాబోయ్ దోమలు

- అవి కుట్టడం వల్ల విస్తరిస్తున్న సీజనల్ వ్యాధులు
- వనపర్తి జిల్లాలో డెంగీతో అల్లాడుతున్న ప్రజలు
- ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు.. ఇళ్ల మధ్యలో నీటి నిల్వలు
- వ్యాధులపై రెడ్ అలర్ట్ ప్రకటించిన అధికారులు



వనపర్తి పట్టణంలోని శ్వేతానగర్‌లో ఇళ్ల మధ్యలో నుంచి ప్రవహిస్తూ అపరిశుభ్రంగా మారిన వాగు

వనపర్తి వైద్యవిభాగం, అగస్టు 28: వర్షాకాలం వచ్చిందంటే సీజనల్ వ్యాధులు జనాలపై విరుచుకుపడుతుంటాయి. మలేరియా, చికున్‌గున్యా, ఫైలేరియా, డెంగీ వంటి సీజనల్ వ్యాధులు చాపకింద నీరులా వ్యాపిస్తున్నాయి. సీజన్‌లో వ్యాపించే ప్రాణాంతక వ్యాధులను అరికట్టడంలో దోమల వ్యాప్తి నివారణ చర్యలు సక్రమంగా చేపట్టకపోవడమే ప్రధాన కారణం. పరిసరాల పరిశుభ్రతతో దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని, ఇంటి పరిసరాల్లో నీటినిల్వ లేకుండా చూసుకోవాలని చెప్పడంతోనే సరిపెడుతున్నారనే విమర్శలు లేకపోలేదు. ఫలితంగా దోమల వ్యాప్తి రోజురోజుకు పెరుగుతుండటంతో డెంగీ, చికున్‌గున్యా కేసుల నమోదు సంఖ్య పెరుగుతుండటం కలవరపెడుతున్న అంశం.



ఇళ్ల మధ్యన ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

ప్రత్యేక బృందాలతో కట్టడికి చర్యలు తీసుకుంటున్నాం



జిల్లాలో సీజనల్ వ్యాధులను కట్టడి చేయడం కోసం గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ప్రత్యేక ర్యాపిడ్ యాక్షన్ బృందాలతో, ఏఎల్‌వో సభ్యులతో చర్యలు తీసుకుంటున్నాం. జ్వరం వచ్చిన రోగికి ప్లేట్ లెట్స్ తగ్గితే డెంగీ వ్యాధి వచ్చినట్లు కాదు. కిట్టు మెథడ్ పరీక్ష ద్వారా పాజిటివ్ వచ్చినా డెంగీ ఉన్నట్లు కాదు. కేవలం ఎలిసా పరీక్షలో పాజిటివ్ వస్తేనే డెంగీ వచ్చినట్లు. ప్రభుత్వ ఆస్పత్రిలో డెంగీ వ్యాధి పరీక్షలు విరివిగా చేస్తున్నాం.

- డాక్టర్ సాయినాథ్‌రెడ్డి, జిల్లా ప్రోగ్రాం అధికారి, వనపర్తి

దోమలకు ఆవాసాలు...

జిల్లాలో మొత్తం ఐదు మునిసిపాలిటీలు ఉండగా, వాటిలో 80 వార్డులు ఉన్నాయి. అందులో సింహభాగం మురికివాడలుగానే దర్శనమిస్తున్నాయి. అంతేకాకుండా ఖాళీ స్థలాలు, లే అవుట్ ప్రదేశాలలో కూడా పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. కొన్ని ప్రాంతాల్లో చిన్న పాటి వర్షాలకే డ్రైనేజీలు నిండి రోడ్లపై మురుగునీరు ప్రవమిస్తోంది. ఇళ్ల మధ్యలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలతో, ఇంటి పరిసర ప్రాంతాల్లోనే మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి.

మొక్కుబడి చర్యలతోనే సరి..

వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టడంలో మునిసిపల్, గ్రామ పంచాయతీ, వైద్యాధికారులు సమన్వయంతో పని చేసుకుంటూ కట్టడి చర్యలను పకడ్బందీగా అమలు చేయాల్సి ఉన్నది. కానీ జిల్లాలో మాత్రం అధికారులు మొక్కుబడి చర్యలతోనే సరిపెడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాకు నూతనంగా వచ్చిన కలెక్టర్ దోమల వ్యాప్తిని, డెంగీ, మలేరియా, చికున్ గున్యా వంటి వ్యాధులను అరికట్టాలనే దృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. నిత్యం అధికారులతో సమీక్షలు, ఫ్రైడే రోజు డ్రైడే కార్యక్రమాలలో నేరుగా పాల్గొని ప్రజలను అప్రమత్తం చేయడంలో నిమగ్నమవుతున్నారు. కానీ సంబంధిత శాఖల అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో డెంగీ కేసులు రోజురోజుకు పెరుగుతు భయాందోళన కలిగిస్తున్నాయి. జిల్లాలో ఐదు మునిసిపాలిటీలు ఉండగా వాటిలో ఫాగింగ్ యంత్రాలు అరకొరగానే ఉన్నాయి. అరకొరగా ఫాగింగ్ చర్యలు చేపడుతూ చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక అయిల్ బాల్స్ వదలడం అనే విషయానికి వస్తే ఎప్పుడో? ఎక్కడో? కనిపించని కార్యక్రమంగా మారందనే చెప్పాలి.

ఈ ఏడాది 80 కేసుల పైమాటే

గత రెండేళ్ల నుంచి పోల్చేకుంటే ఈ ఏడాది డెంగీ కేసులు గణనీయంగా పెరిగే ప్రమాదం ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. 2022లో జిల్లాలో 42 డెంగీ కేసులు నమోదు కాగా, 2023లో 19 కేసులు నమోదు అయ్యాయి. తాజాగా ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు 28వరకు ప్రభుత్వ ఆస్పత్రిలో 26 కేసులు, ప్రైవేటులో 54 కేసులు మొత్తం 80 డెంగీ కేసులు నమోదు అయ్యాయి. వచ్చే నెల సెప్టెంబరులో సీజనల్ వ్యాధులు మరింతగా విజృంభించే ప్రమాదం ఉన్న తరుణంలో వాటి సంఖ్య ఏ తరహాలో ఉంటుందోనన్న ఆందోళన కలుగుతోంది. దీంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వ్యాధులను కట్టడి చేయడం కోసం జిల్లాను ముందస్తు చర్యలో భాగంగా రెడ్ అలర్ట్‌గా ప్రకటించారు.

మంచం పట్టిన పల్లెలు

- జ్వరంతో వణికిపోతున్న ప్రజలు
- పారిశుధ్య పనులలో నిర్లక్ష్యం
- పట్టించుకోని అధికారులు

మిడ్జిల్, ఆగస్టు 28 : గ్రామాలలో పారిశుధ్య పనులను పూర్తి స్థాయిలో చేయించడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మురుగునీటిలో దోమలు విపరీతమై ప్రజలను అంటువ్యాధుల బారిన పడేలా దోహదం చేస్తున్నాయి. గ్రామాలలోని ప్రజలకు విషజ్వరాలతో తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. మండలంలోని పలు గ్రామాలలోని ప్రజలు వైరల్ ఫీవర్, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాలతో మంచాన పడుతున్నారు. ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లేందుకు జంకుతున్నారు. గ్రామాలలోని ఉన్న ఆర్ఎంపీ వైద్యులతో వైద్య పరీక్షలు చేయించుకొని వారు ఇచ్చిన మందుబిల్లలను మింగుతున్నారు. తీరా ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తే ఆ టెస్టులు, ఈ టెస్టులు అని బిల్లులు తడిసి మోపెడు చేస్తున్నారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో ఆర్ఎంపీలు తమ స్థాయికి మించిన వైద్యం చేస్తున్నప్పటికీ వైద్యాధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.



మిడ్జిల్‌లో నిలిచిన మురుగు నీరు

● మొక్కుబడిగా : గ్రామాలలోని నీరు నిలిచిన ప్రదేశంలో చేపట్టాల్సిన పనులను గ్రామ స్థాయి అధికారులు మొక్కుబడిగా చేయిస్తున్నారు. బ్లీచింగ్ పౌడర్‌లో ఎక్కువ మొత్తంలో సున్నం కలిపి చల్లినట్లు ఫొటోలు దిగుతూ మమ అనిపించుకుంటున్నారు.

● ఫాగింగ్ చేయక ఎన్నో నెలలు : గ్రామాలలోని ప్రతీ వర్షాకాల సీజన్‌లో తప్పని సరిగా వారం నుంచి 15 రోజులకొకసారి ఫాగింగ్ చేస్తూ దోమల నివారణకు చర్యలు చేపట్టేవారు. ప్రస్తుతం 5నెలలు కావస్తున్నా గ్రామాలలోని దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టడంలేదు. గ్రామాలలోని పారిశుధ్య పనులు పూర్తిస్థాయిలో చేయించి, పేదప్రజలకు ప్రభుత్వ వైద్యం అందేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

వరుస దొంగతనాలు

- అచ్చంపేటలో తాళం వేసిన ఇళ్లకు కన్నాలు వేస్తున్న దుండగలు

అచ్చంపేటటౌన్, ఆగస్టు 28 : తాళం వేసిన ఇంటికి కన్నం వేసి కొంత నగదు, బంగారు ఆభరణాలు దొంగిలించిన సంఘటన బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన ఓ వ్యక్తి బుధవారం ఇంటికి తాళం వేసి ఉద్యోగ్యానికి వెళ్లాడు. సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగలగొట్టడాన్ని గమనించాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా పగలకొట్టి కొంత నగదు, తులం బంగారంను దుండగులు ఎత్తికెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. ఇదిలా ఉండగా, పట్టణంలో వరుస దొంగతనాలతో పట్టణవాసులు బెంబేలెత్తిపోతున్నారు. వారంరోజుల్లో మూడు ఇళ్లల్లో దొంగతనాలు జరగడంతో వారు భయాందోళన చెందుతున్నారు.

ఊట్కూర్‌లో నగలు, నగదు చోరీ

- పట్టపగలే తాళం వేసిన ఇంట్లో చోరీ

ఊట్కూర్, ఆగస్టు 28: పట్టపగలే తాళం వేసిన ఇంట్లో చోరీ జరిింది. ఈ సంఘటన నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. బాధితుడి కథనం కథనం ప్రకారం.. మోటార్ వీధిలో నివాసం ఉండే శేఖర్‌రెడ్డి ఉదయం తన భార్య ఊరికి వెళ్లడంతో మధ్యాహ్నం వరకు ఇంట్లోనే ఉండి భోజనం చేసిన అనంతరం ఇంటికి తాళం వేసి వ్యవసాయ పొలానికి వెళ్లారు. సాయంత్రం ఇంటికి తిరిగి రాగా, తలుపులు తెరిచి ఉండటం గమనించి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా సైతం తెరిచి ఉండటంతో అవాక్కయ్యాడు. బీరువా తాళం తీసి మరీ నాలుగన్నర తులాల బంగారం ఆభరణాలు, ఇరవై ఐదు తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.లక్ష నగదు కనిపించకపోవడంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. క్లూస్ టీం చేరుకొని ఫ్రింగర్ ప్రింట్ సేకరించారు. ఈ సంఘటనపై ఎస్‌ఐ కృష్ణంరాజును వివరణ కోరగా, ఇంటిని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వైద్యం వికటించి బాలుడి మృతి

- ప్రాణం ఖరీదు లక్ష రూపాయలు కట్టించిన ఆర్ఎంపీ



యశ్వంత్ (ఫైల్)

పెబ్బేరురూరల్, ఆగస్టు 28: వచ్చీ రాని వైద్యం ఓ బాలుడి ప్రాణాలను బలిగొంది. ఆర్ఎంపీ వైద్యం వికటించి బాలుడు మృతి చెందిన ఘటన వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలో చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగులోనికి వచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పెబ్బేరు పట్టణ కేంద్రంలో దళిత కాలనీకి చెందిన విజయ్, విజయలక్ష్మి దంపతుల కుమారుడు యశ్వంత్ (7) మూడు రోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఆ బాలుడిని పట్టణంలోని ఓ ఆర్ఎంపీ వైద్యుడి వద్ద వైద్యం చేయించారు. వచ్చీరాని వైద్యంతో మూడు రోజులుగా ట్రీట్‌మెంట్ చేస్తూ సైలెన్స్ బాటిళ్లు ఎక్కించాడు. మీ బాబుకు ఏమి కాదులే అని గట్టి భరోసా ఇవ్వడంతో తల్లిదండ్రులు ఇంటికి తీసుకుపోయారు. ఇంటికి వెళ్లిన రాత్రే అస్వస్థతకు గురై బాలుడు కన్ను మూయడంతో కుటుంబ సభ్యులు లబోదిబోమన్నారు. ఏమి తోచని తల్లిదండ్రులు ఒక రాజకీయ నాయకున్ని ఆశ్రయించారు. దీంతో ఆ రాజకీయ నాయకుడు రంగ ప్రవేశం చేసి ఆ ఆర్ఎంపీ డాక్టర్ వద్ద బాలుడి ప్రాణం ఖరీదు లక్ష రూపాయలు కుటుంబ సభ్యులకు ఇప్పించినట్లు సమాచారం. పట్టణంలో, మండలపరిధిలోని గ్రామాల్లో విచ్చలవిడిగా ఆర్ఎంపీలు వైద్యం అందిస్తున్నారు. మూడు మాసాల్లో పెబ్బేరులో ఆర్ఎంపీ వైద్యులు వచ్చీరాని వైద్యం చేసి నలుగురి ప్రాణాలు బలి తీసుకున్నారు. వారి ప్రాణం విలువ కట్టడం పరిపాటిగా మారింది. మండలంలో ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు ఫస్ట్ ఎయిడ్ మాత్రమే చేయాలనే నిబంధన ఉండగా తాము పెద్ద డాక్టర్లమంటూ అన్ని రకాల వైద్యం చేస్తూ అమాయక ప్రజలను మభ్యపెడుతూ ప్రాణాలు బలి తీసుకుంటున్నారు. ఇలాంటి సంఘటనలను జిల్లా వైద్యాధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా వైద్యాధికారులు నిద్రమత్తు వదిలి పర్యవేక్షిస్తూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పథకాలు అందేలా చూడాలి

- జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షహజాది



సమావేశంలో మాట్లాడుతున్న సయ్యద్ షహజాది

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఆగస్టు28: అల్ప సంఖ్యాక వర్గాల అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షహజాది అధికారులకు సూచించారు. బుధవారం ఆమె వనపర్తి జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ సమావేశమందిరంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ గిరిధర్‌తో కలిసి 15 పాయింట్ ప్రోగ్రాం అమలుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. వనపర్తి జిల్లాలో అల్పసంఖ్యాక వర్గాల ప్రజలకు అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. మైనార్టీలకు సంబంధించిన ఎన్ని పాఠశాలలు ఉన్నాయి? ప్రభుత్వ స్థలంలో ఉన్నవి ఎన్ని, ఎంతమంది విద్యార్థులు ఉన్నారు? అనే వివరాలను జిల్లా విద్యాశాఖ అధికారిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో పరిసరాల పరిశుభ్రత పాటించాలని మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారికి సూచించారు. షాదీ ముబారక్, నైపుణ్య శిక్షణ, షాదీఖానాల నిర్మాణాలు, ప్రధానమంత్రి జన్ ఆవాస్ యోజన, వక్ఫ్ భూముల వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో షాదీఖానాలు మంజూరు అయ్యాయని వాటిలో కొన్ని పూర్తి కాగా మరి కొన్ని నిర్మాణ దశలో ఉన్నట్లు ఆర్డీవో పద్మావతి వివరించారు. మసీదుల వద్ద కామన్ హాల్స్ నిర్మాణ పనులు జరుగుతున్నట్లు ఆర్డీవో వివరించారు. ఘణపూర్ మండలంలో 21 ఎకరాల వక్ఫ్‌భూములు ఆక్రమణకు గురయ్యాయని, ఆత్మకూరులో వక్ఫ్ భూముల ఆక్రమణలపై మైనార్టీ పెద్దలు కమిషన్ సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన కమిటీ సభ్యులు వెంటనే చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో అల్ప సంఖ్యాక వర్గాల అభ్యున్నతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేవిధంగా జిల్లా యంత్రాంగం పని చేస్తుందని తెలిపారు. ఎస్పీ గిరిధర్ మాట్లాడుతూ జిల్లాలో ట్రిబుల్ తలాక్ వంటి కేసులు నమోదు కాలేదని, శాంతిభద్రతల విషయంలో ఎలాంటి సమస్యలు లేవని చెప్పారు. అంతకుముందు కమిషన్ సభ్యురాలు సయ్యద్ షహాజాదిని కలెక్టర్, ఎస్పీ పుష్పగుచ్చాలు ఇచ్చి స్వాగతం పలికారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) నగేష్,ఆర్డీవో పద్మావతి, జిల్లా అధికారులు తహసీల్దార్‌లు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యంతో చదువుకోవాలి

వనపర్తి రూరల్: అమ్మాయిలు లక్ష్యంతో చదువుకొని ఒకరిపై ఆధారపడకుండా తమ కాళ్లపై తాము నిలబడాలని జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షహాజాది ఉద్బోధించారు. మంగళవారం ఉదయం వనపర్తి పట్టణంలోని మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో ఉన్న మౌలిక వసతులు, విద్యార్థుల నమోదు పరిశీలించి విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ అమ్మాయిలు ఎందులోనూ తక్కువ కాదని, ఏ సమస్య వచ్చిన ఇంకొకరిపై ఆధారపడకుండా ధైర్యంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. అది పాఠశాల నుంచే ప్రారంభం కావాలని, ఏమైనా సమస్యలు ఉంటే ధైర్యంగా ప్రశ్నించాలని సూచించారు. ఆమె వెంట ఆర్డీవో పద్మావతి, డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఆర్ఎల్‌సి కిరణ్మయి, ప్రిన్సిపాల్ సౌమ్య, జూనియర్ కళాశాలప్రిన్సిపాల్ హవిలారాణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పెద్ద వడ్డెమాన్‌లో బస్సుకోసం ఆందోళన



పెద్ద వడ్డెమాన్‌లో రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు, విద్యార్థులు

చిన్నచింతకుంట, ఆగస్టు 28 : ఉదయం వేళ బస్సులు గ్రామంలో నిలపడం లేదని గ్రామస్థులతో కలిసి విద్యార్థులు ఆందోళన చేపట్టారు. మండలంలోని పెద్ద వడ్డెమాన్ గ్రామంలో స్థానికులు, విద్యార్థులు కలిసి రాస్తారోకో చేపట్టారు. జిల్లా కేంద్రానికి వెళ్తున్న బస్సులు ఉదయం సమయంలో ప్రయాణికులతో రద్దీగా ఉండటంతో గ్రామంలో బస్సులను ఆపటం లేదని, దీనికి నిరసనగానే ఆందోళనకు దిగామని స్థానికులు, విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో కళాశాలకు, ఇతర ప్రైవేటు ఉద్యోగాలకు వెళ్లాల్సిన వారు ఎంతో మంది బస్సులు ఆపకపోవటం వల్ల అనేక అవస్థలకు గురవుతున్నారు. సంబంధిత ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యను వెంటనే పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలని, అదనంగా బస్సులు నడపాలని వారు డిమాండ్ చేశారు. పోలీసులు వచ్చి సముదాయించటంతో కొంత వరకు ఆందోళన చేసి విరమించారు.

కారు బోల్తా పడి ఆరుగురికి గాయాలు



క్షతగాత్రులను కారులో నుంచి బయటికి తీస్తున్న స్థానికులు

మూసాపేట, ఆగస్టు 28 : కారు అదుపు తప్పి బోల్తాపడిన సంఘటనలో ఆరుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని 44వ జాతీయ రహదారిపై బుదవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి జిల్లాకు చెందిన చంద్రశేఖర్, అలివేలమ్మ, నవీన్, రాజేశ్వరి, శ్రీనివాసులు తదితరులు కారులో మహబూబ్‌నగర్ వెళ్లేందుకు వస్తున్నారు. వీరు ప్రయాణిస్తున్న కారు మూసాపేట మండలంలోని జానంపేట గ్రామశివారులో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ సంఘటనలో కారులో ఉన్న డ్రైవర్‌తో పాటు ఐదుగురికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను స్థానికులు జానంపేట దగ్గర ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

డాక్టర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

నారాయణపేట టౌన్, ఆగస్టు 28 : నారాయణపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకిషన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్లు నేరుగా తమ సర్టిఫికెట్లతో సెప్టెంబరు రెండో తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు మెడికల్ కళాశాలలో హాజరుకావాలన్నారు. గౌరవ వేతనంతో కూడిన ప్రాతిపదికన ప్రొఫెసర్లు తొమ్మిది, అసోసియేట్ ప్రొఫెసర్లు 17, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 16, సీనియర్ రెసిడెంట్లు 20 పోస్టుల భర్తీకై దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

మక్తల్ రూరల్, ఆగస్టు 28 : మక్తల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీ విద్యార్థులకు బోధించుటకు అర్హత కలిగిన అధ్యాపకులు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణగౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్, ఎకనామిక్స్, కామర్స్, బాటని, కెమిస్ట్రీ, మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్‌లో గల ఒక్కో పోస్టుకు గాను ఈనెల 30వ తేదీ లోపు దరఖాస్తులు అందజేయాలని కోరారు. దరఖాస్తుల పరిశీలన, రాత పరీక్షలు నిర్వహించి, నియామకం చేస్తామని తెలిపారు. అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలి

నారాయణపేట టౌన్, ఆగస్టు 28 : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ వీసీ హాల్‌లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మెడికల్ డాక్టర్లకు సీజనల్ వ్యాధులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జ్వర పీడితులు ఆసుపత్రికి వస్తే రక్త నమూనాలు సేకరించి జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు అందించాలన్నారు. అలాగే వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. మునిసిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో అవగాహన కల్పించాలన్నారు. గీత ఆసుపత్రిలో 16 ఫీవర్ కేసులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ సౌభాగ్యలక్ష్మి, డాక్టర్ రాఘవేందర్, డాక్టర్ శైలజ, సాయిరాం పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటాలి : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్ రూరల్, ఆగస్టు 28 : విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. మక్తల్ మైదానంలో ఏర్పాటు చేసిన ద్రోణాచార్య స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రీడా పోటీలు, సాంస్కృతి కార్యక్రమాలను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించి, మాట్లాడారు. విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటి మక్తల్‌కు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అదే విధంగా ఆర్థిక పరిస్థితి బాగోలేని వారికి క్రీడల్లో రాణించేందుకు ఆర్థిక సాయం అందించి ప్రోత్సహించడానికి సిద్ధంగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, నాయకులు బాలకృష్ణారెడ్డి, గవినోళ్ల గోపాల్‌రెడ్డి, రవికుమార్ యాదవ్, అనిల్‌గౌడ్, కావలి రాజేందర్, పీఈటీ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యను అధిగమిద్దాం

నారాయణపేట, ఆగస్టు 28 : జిల్లాలో డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్‌ను అందిస్తూ వచ్చే వేసవిలో విద్యుత్ సమస్యను అధిగమించేందుకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని విద్యుత్ శాఖ సీఎండీ ముషారఫ్ అలీ అన్నారు. బుధవారం నారాయణపేటకు వచ్చిన సీఎండీ విద్యుత్ శాఖ ఎస్ఈ ప్రభాకర్‌తో పాటు డీఈ, ఏఈలతో సమీక్షా సమావేశం నిర్వహించి, విద్యుత్ శాఖకు సంబంధించి జిల్లా వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ బిల్లులు డిమాండ్‌కు అనుగుణంగా రాబట్టాలని సూచించారు.

ఎస్ఈ కార్యాలయం, డిస్ట్రిక్ట్ స్టోర్ మంజూరుకు వినతి

జిల్లా ఏర్పడి ఏడు సంవత్సరాలైన జిల్లా ఎస్ఈ కార్యాలయానికి సొంత భవనం లేదని నూతన భవనం మంజూరు చేసి డిస్ట్రిక్ట్ స్టోర్‌ను ఏర్పాటు చేయాలని సీఎండీకి జిల్లా విద్యుత్ కాంట్రాక్టర్ల సంఘం అధ్యక్షుడు పోలేమోని కృష్ణ వినతి పత్రం అందజేశారు. జిల్లా స్టోర్ లేక మెటీరియల్ కోసం మహబూబ్‌నగర్‌కు వెళ్లాల్సి వస్తోందని, ఇబ్బందులను గుర్తించి జిల్లా స్టోర్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్లు కతల్, శ్రీకాంత్, మెహదీన్, అశోక్‌గౌడ్, పాషా, సూరి ఉన్నారు.

ప్రయాణికులకు సరిపడా బస్సులు నడపాలి



ఆర్టీసీ బస్టాండ్‌లో సంతకాలు చేపట్టిన పీవోడబ్ల్యూ నాయకులు

నారాయణపేట, ఆగస్టు 28 : రాష్ట్ర ప్రభుత్వం ప్రయాణికులకు సరిపడా ఆర్టీసీ బస్సులను నడపాలని పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో బుధవారం నారాయణపేట ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల నుంచి సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మి మాట్లాడుతూ.. అరకొర బస్సులతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రభుత్వం కొత్త బస్సులు కొనుగోలు చేసి నడపాలని డిమాండ్ చేశారు. బస్సుల కొరతతో మహిళలు, ప్రయాణికులు రవాణా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయాణికుల నుంచి సంతకాలు సేకరించి త్వరలో ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ను కలవనున్నట్లు తెలిపారు. పీవోడబ్ల్యూ నాయకులు మంజుల, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు సునీత, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకులు కాశినాథ్, కెంచి నారాయణ, పీడీఎస్‌యూ సాయికిరణ్, నరసింహ, ప్రశాంత్ పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ ముందు రైతుల నిరసన

» రెండు రోజులుగా పని చేయని నెట్‌వర్క్

ఊట్కూర్, ఆగస్టు 28 : మండలంలోని పెద్దజట్రం గ్రామ కెనరా బ్యాంక్‌లో సర్వర్ పనిచేయక సేవలు నిలిచిపోవడంతో బుధవారం బ్యాంక్‌కు వచ్చిన రైతులు అధికారుల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని అవసులోన్‌పల్లి, మగ్దుంపూర్, పెద్దజట్రం గ్రామాలకు చెందిన రైతులు రుణమాఫీ కావడంతో రెన్యూవల్ కోసం బ్యాంక్‌కు వస్తున్నారు. వరుసగా శని, ఆది, సోమవారాలు మూడు రోజుల పాటు సెలవులు రావడంతో మళ్లీ మంగళవారం వచ్చిన రైతులు నెట్‌వర్క్ పని చేయడం లేదని చెప్పడంతో వెనక్కి వెళ్లారు. బుధవారం సైతం నెట్‌వర్క్ పని చేయడం లేదని అధికారులు చెప్పడంతో కొందరు రైతులు అధికారులతో వాదనకు దిగారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రతీ రోజు ఇబ్బంది పడుతున్నామని రైతులు వాకిటి వెంకటేష్, కె.నర్సిములు, శేఖర్‌రెడ్డి, రమేష్, భాస్కర్, కొండన్న తెలిపారు. కాలయాపన చేయకుండా వెంటనే రైతులకు రెన్యూవల్ చేసి కొత్త రుణాలు ఇవ్వాలని రైతులు కోరారు.

రేపు విద్యార్థులకు టెన్నికాయిట్ పోటీలు

మక్తల్‌రూరల్, ఆగస్టు 28 : ఈనెల 30న శుక్రవారం పది గంటలకు మక్తల్ సాయిజ్యోతి ఉన్నత పాఠశాలలో బాలబాలికలకు జిల్లాస్థాయి సబ్ జూనియర్స్ టెన్నికాయిట్ (రింగ్‌బాల్) ఎంపికలను నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు కావలి శ్రీహరి, ప్రధాన కార్యదర్శి బి.దీప బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రతీ పాఠశాల నుంచి ఇద్దరు బాలికలు, ఇద్దరు బాలురు పాఠశాల బోనఫైడ్‌తో పాటు క్రీడా దుస్తులు ధరించి హాజరుకావాలని తెలిపారు. బాల బాలికలు 1-04-2010 తరువాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. జిల్లా స్థాయిలో నైపుణ్యతను ప్రదర్శించిన నలుగురు బాలికలను, నలుగురు బాలురను ఎంపిక చేసి వచ్చే నెల ఒకటి నుంచి మూడు వరకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు పంపుతామని తెలిపారు.

వీవోఏలకు కనీస వేతనం అందజేయాలి

» మునిసిపల్ పార్క్ ముందు ధర్నా

నారాయణపేట, ఆగస్టు 28 : గ్రామీణ ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయక గ్రూపులలో సహాయపడుతున్న వీవోఏలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రామ్, వీవోఏల జిల్లా సంఘం అధ్యక్షుడు భీమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం నారాయణపేట మునిసిపల్ కార్యాలయం ముందు జరిగిన ధర్నాను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కనీస వేతనం అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. మహిళల ఆర్థిక ఎదుగుదలకు పని చేస్తున్న వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, రూ.10 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం డీఆర్డీఏ మొగులప్పకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జోషి, బాబు, కృష్ణ పురుషోత్తం, లక్ష్మణ్, బీరప్ప, విజయలక్ష్మి, లక్ష్మి, నాగయ్య పాల్గొన్నారు.

విద్యా సామర్థ్యాలు పెంచాలి

» ట్రైనీ కలెక్టర్ గరీమా నరుల



ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్

ఊట్కూర్, ఆగస్టు 28 : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పెంచేలా అందరం కలిసి కృషి చేద్దామని ట్రైనీ కలెక్టర్ గరీమా నరుల అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో బోధన సామర్థ్యాలను పరిశీలించి, ఆంగ్ల పాఠ్య పుస్తకాల్లో ప్రశ్నలు అడిగి జవాబును రాబట్టారు. ఉర్దూ మీడియం పాఠశాల విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం ఆమె మట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సామర్థ్యాలను పెంచడానికి ప్రత్యేక కార్యక్రమం చేపట్టించదన్నారు. ఇందు కోసం ప్రాథమిక స్థాయిలో (ఎఫ్ఎల్ఎన్) ఫౌండేషన్ లెర్నింగ్ న్యూమరిసీ, ఉన్నత విద్యార్థుల ప్రగతి కోసం లిప్ (లెర్నింగ్ ఇంప్రూమెంట్ ప్రోగ్రాం) కార్యక్రమాలు పునరుద్ధరించారని తెలిపారు. ఈ నెల చివరిలో అన్ని పాఠశాలల్లో బెస్‌లైన్ పరీక్షలు నిర్వహించిన అనంతరం అభ్యాసన సామర్థ్యాలు పెంపొందించడానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. వర్క్ షీట్, సిలబస్ మాడ్యుల్, పాఠ్యపుస్తకాల ఆధారంగా బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం మాధవి పాల్గొన్నారు.

మారండి.. మంచిగా బతకండి

» రౌడీ షీటర్ల సమావేశంలో ఎస్పీ యోగేష్ గౌతమ్



రౌడీ షీటర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట, ఆగస్టు 28 : మారండి.. మంచిగా బతకండి అంటూ ఎస్పీ యోగేష్ గౌతమ్ పేర్కొన్నారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో రానున్న పండుగల సందర్భంగా కమ్యూనిటీ సస్పెక్ట్, రౌడీ షీటర్స్‌తో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. ప్రస్తుతం ఏం పని చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఎలా జీవిస్తున్నారు.. వారి నేర చరిత్ర, ప్రస్తుత జీవన విధానం, వారి స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. సత్ప్రవర్తనతో మెలిగే వారికి పోలీసుల సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. పోలీసుల నిఘా ఎప్పుడూ ఉంటుందని, నేరస్థులు చట్టం నుంచి తప్పించుకోలేరని స్పష్టం చేశారు. నేరస్తులు తమ ఆకృత్యాలను పునరావృతం కాకుండా సరైన మార్గంలో నడవాలన్నారు. నేరం చేసే ముందు మీరు మీ కుటుంబం పిల్లల భవిష్యత్ ఆలోచించాలన్నారు. రౌడీ షీటర్లు మంచిగా మారి సమాజాభివృద్ధికి దోహద పడితే రౌడీ షీట్‌ను తొలగించేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. పండుగల సందర్భంగా ఎలాంటి మతపరమైన గొడవలు, ఘర్షణకు పాల్పడకుండా కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీ లింగయ్య, సీఐ రామ్‌లాల్, ఊట్కూర్ ఎస్ఐ కృష్ణంరాజు పాల్గొన్నారు.

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి

» ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా



వ్యవసాయ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న ప్రగతిశీల రైతు సంఘం నాయకులు

నారాయణపేట, ఆగస్టు 28 : రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలని అఖిల భారత ప్రగతి శీల రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.రాము, జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి కాశీనాథ్ డిమాండ్ చేశారు. మంగళవారం నారాయణపేట జిల్లా వ్యవసాయ కార్యాలయం ముందు జరిగిన ధర్నాను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు వరంగల్‌లో రైతు డిక్లరేషన్ పేరుతో రైతులను రుణ విముక్తి చేసేందుకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించి, అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక ఆంక్షలు పెట్టడంతో చాలా మంది రైతులకు రుణమాఫీ అందకుండా పోయిందన్నారు. రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా అందించకుండా కాలయాపన చేయడం తగదన్నారు. ఖరీఫ్‌లో పండించే పంటలకు బోనస్ ఇచ్చి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. రైతులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని, లేకుంటే గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చెన్నారెడ్డి, కృష్ణ, కొండ నర్సింహులు, నారాయణ, బాలకృష్ణ, చంద్రాములు, రాజు తాయప్ప, ప్రశాంత్, వెంకట్ రాములు, చెన్నప్ప, రాములు, అంజి, సాయి కుమార్ పాల్గొన్నారు.

ఏవోకు వినతి

దామరగిద్ద : కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఏవో హరితకు వినతిపత్రం అందించారు. ఎన్నికల్లో ఒక హామీ ఇచ్చి.. ఎన్నికల తర్వాత మాట మార్చడం ఎంతవరకు సమంజసమన్నారు. పట్టా పాసు పుస్తకం ప్రాతిపదికన రుణమాఫీ చేయాలన్నారు. లేకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు పెద్దింటి తాయప్ప, మధు, మహేష్, బాల్‌రాజ్, అజయ్, రాజు, నారాయణమ్మ, కవిత పాల్గొన్నారు.

రిజర్వాయర్ల పనుల పరిశీలన

మక్తల్ రూరల్, ఆగస్టు 28 : మక్తల్ మండలంలోని సంగంబండ రిజర్వాయర్, భూత్పూర్ రిజర్వాయర్లను బుధవారం కేంద్ర జల సంఘం డైరెక్టర్ సీడబ్ల్యూసీ శ్రీనివాసులు, అసిస్టెంట్ డైరెక్టర్ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా సంగంబండ రిజర్వాయర్, భూత్పూర్ రిజర్వాయర్ల కుడి, ఎడమ కాలువల పనులు పరిశీలించి ఇరిగేషన్ శాఖ అధికారులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈఈ సంజీవ్‌ప్రసాద్, ఏఈ మోహన్, డీఈలు వెంకటరమణ, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయం మార్చుకోవాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రామ్

నారాయణపేట, ఆగస్టు 28 : భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పథకాలను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పాలన్నా నిర్ణయాన్ని ప్రభుత్వం మార్చుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రామ్ డిమాండ్ చేశారు. మంగళవారం నారాయణపేట మునిసిపల్ పార్కు దగ్గర భవన నిర్మాణ కార్మిక సంఘం సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ నిర్ణయం వల్ల కార్మికుల నుంచి వచ్చే దరఖాస్తులను చిన్న చిన్న కారణాలతో ప్రైవేట్ కంపెనీలు తిరస్కరించి బోర్డులో జమయ్యే డబ్బులు కాజేసే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం కార్మికులకు నష్టం కల్గించే విధానాలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ అమరేందర్ కృష్ణకు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ నాయకులు జోషి, వెంకట్ రాములు, బాలయ్య, వీరనాగు, శంకర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ అమలు చేయాలి



కొల్లూర్ పాఠశాలలో సభ్యత్వం చేయిస్తున్న తపస్ నాయకులు

ఊట్కూర్, ఆగస్టు 28 : ప్రభుత్వం ఉమ్మడి సర్వీస్ రూల్స్‌ను అమలు చేసి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని తపస్ జిల్లా సమన్వయ కర్త నర్సింగప్ప డిమాండ్ చేశారు. తపస్ సభ్యత్వం అభియాన్‌లో భాగంగా బుధవారం మండలంలోని కొల్లూర్, ఎడవెల్లి, చిన్నపొర్ల, పెద్దపొర్ల, మల్లెపల్లి, సమిస్తాపూర్, తిప్రాస్‌పల్లి గ్రామ పాఠశాలల్లో ఉపాధ్యాయులతో సభ్యత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి సర్వీస్ రూల్స్ ఎన్నో సంవత్సరాల నుంచి చిక్కుల్లో ఉండగా, తపస్ కృషితో కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు తగు ఆదేశాలు జారీ చేసిందన్నారు. కానీ అప్పటి ప్రభుత్వం చొరవ చూపకపోవడంతో ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలుకు నోచుకోలేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉమ్మడి సర్వీస్ రూల్స్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా మీడియా ఇన్‌చార్జి కిరణ్, మండల ప్రధాన కార్యదర్శి కృష్ణ, సహాయ కార్యదర్శి గోపాల్, మండల నాయకులు రమేష్, కృష్ణయ్య, వెంకటయ్య, కల్పన, కల్యాణి, అంబిక, లక్ష్మి, రాజశ్రీ, సుజిత కుమారి పాల్గొన్నారు.

ఇటుక బట్టీ యజమానులపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

మక్తల్ రూరల్, ఆగస్టు 28 : మక్తల్ నుంచి కాట్రేవుపల్లికి వెళ్లాల్సిన రహదారికి ఇరు వైపులా విచ్చల విడిగా అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ఇటుక బట్టీలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం రైతులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒండ్రు మట్టి తరలింపు, అధిక లోడు గల ఇటుకలను తరలిస్తున్న కారణంగా కాట్రేవుపల్లి రహదారి గుంతలమయంగా మారిందన్నారు. దీంతో పలు సందర్భాలలో రైతులు పొలాలకు వెళ్తూ కిందపడి గాయాలపాలైనట్లు వారు తెలిపారు. ఇటుక బట్టీలకు కనీసం పొల్యూషన్ బోర్డు అనుమతులు కూడా లేవని, ఇటుక బట్టీల నుంచి వెదజల్లుతున్న కాలుష్యం కారణంగా ఆరుగాలం కష్టపడి పండించిన పంట పొలాలు చేతికి రావడం లేదన్నారు. ఇదేమిటి అని ఇటుక బట్టి యజమానులను అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నారని కాట్రేవుపల్లి, యార్నగన్‌పల్లి, రుద్రసముద్రం, మక్తల్, గొల్లపల్లి శివారు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే సెప్టెంబరు నాల్గవ తేదీ నుంచి తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో తిరుపతి, చిన్న నర్సింహులు, రాములు, మద్దిలేటి, రామ్, మాధవ్, చంద్రశేఖర్, అంజప్ప, బండారి శివరాజ్, చిన్న నర్సింహులు పాల్గొన్నారు.

నేటి ర్యాలీని విజయవంతం చేయాలి

నారాయణపేట టౌన్, ఆగస్టు 29 : జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నేడు ఉదయం 6.30 గంటలకు నిర్వహించే క్రీడా దినోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలని జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి ఎస్.వెంకటేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు, ఉద్యోగులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఉన్నత లక్ష్యంతో చదవాలి

నారాయణపేట టౌన్, ఆగస్టు 28 : విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకొని కష్టపడి చదవాలని జిల్లా మైనార్టీ అధికారి ఎం.ఎ రషీద్ అన్నారు. బుధవారం మైనార్టీ స్కూల్‌లో విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేశారు. ప్రభుత్వం మైనార్టీ విద్యార్థుల అభ్యున్నతికై గురుకులాలు ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఖాజా మోహబూబ్ ఖాన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

మక్తల్ రూరల్, ఆగస్టు 28 : మండలంలోని కాచ్‌వార్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు లక్ష్మణ్ బదిలీ వెళ్లడంతో బుధవారం శాలువా, పూలమాలతో సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కృష్ణ, ఆగస్టు 28 : తాలుకా స్థాయి క్రీడా పోటీల్లో మాగనూరు విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ఫిజికల్ డైరెక్టర్ రాకేష్‌శర్మ బుధవారం తెలిపారు. మక్తల్ క్రీడా మైదానంలో జరిగిన పోటీల్లో శివకుమార్, నిహారిక, అఖిల ప్రతిభ కనబర్చగా, హెచ్‌ఎం మురళీధర్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

రిజర్వాయర్ల పనుల పరిశీలన

మక్తల్ రూరల్, ఆగస్టు 28 : మక్తల్ మండలంలోని సంగంబండ రిజర్వాయర్, భూత్పూర్ రిజర్వాయర్లను బుధవారం కేంద్ర జల సంఘం డైరెక్టర్ సీడబ్ల్యూసీ శ్రీనివాసులు, అసిస్టెంట్ డైరెక్టర్ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా సంగంబండ రిజర్వాయర్, భూత్పూర్ రిజర్వాయర్ల కుడి, ఎడమ కాలువల పనులు పరిశీలించి ఇరిగేషన్ శాఖ అధికారులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈఈ సంజీవ్‌ప్రసాద్, ఏఈ మోహన్, డీఈలు వెంకటరమణ, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

ఎంపీ డీకే అరుణకు వినతి

కృష్ణ, ఆగస్టు 28 : మండల పరిధిలోని గుజరందొడ్డి గ్రామానికి బీటీ రోడ్డు లేక మట్టి రోడ్డుతో గ్రామస్థులకు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ ఉప సర్పంచ్ హన్మంత్ రెడ్డి బుధవారం ఎంపీ డీకే అరుణకు వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుజరందొడ్డి, చిట్యాల మధ్య ఉన్న వాగుపై రోడ్డు కం బ్యారేజీ నిర్మాణం చేయడం వల్ల మందిపల్, కొల్పూరు, పుంజనూరు, ముడుమల్, టైరోడ్ ద్వారా కర్ణాటక రాష్ట్రం రాయిచూర్‌కు వెళ్లేందుకు అనుకూలంగా ఉంటుందని ఎంపీకి వివరించగా, ఆమె సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

ఘనంగా బొడ్రాయి, కలశ స్థాపన

నారాయణపేట, ఆగస్టు 28 : స్థానిక అశోక్‌నగర్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయంలో బజరంగ్‌దళ్ యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం ధ్వజస్తంభ, బొడ్రాయి, కలశ స్థాపన ఉత్సవాలు ఘనంగా జరిగాయి. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య బొడ్రాయిని ప్రతిష్ఠించగా ఆడపడుచులు ఉత్సవాలకు తరలివచ్చారు. అనంతరం గోపురంపై శిఖర కలశం స్థాపన గావించారు. యాగశాలలో మృత్యుంజయ హోమం, పూర్ణాహుతి ప్రతేక పూజల అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

యజ్ఞయాగాలతోనే ముక్తికి మార్గం

నారాయణపేట న్యూటౌన్, ఆగస్టు 28 : యజ్ఞయాగాలతోనే ముక్తికి మార్గం అని ఆర్య ప్రతినిధి సభ రాష్ట్ర అధ్యక్షుడు విఠల్‌రావు ఆర్యా అన్నారు. మంగళవారం శ్రావణవేద ప్రచారోత్సవాల్లో భాగంగా స్థానిక ఆర్య సమాజంలో మూడు రోజుల పాటు జరిగిన శావణ మహా యజ్ఞం అనంతరం అన్నదానం చేశారు. ఆర్య సమాజ్ పట్టణ అధ్యక్షుడు విజయ్‌కుమార్ సరోదే, మంత్రి నాగమ్మ, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్‌కిషన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, డాక్టర్ గీత విశ్వనాథ్, ప్రధానోపాధ్యాయుడు నారాయణ, ఓంప్రకాష్, ఆత్మరాం పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య

ధన్వాడ, ఆగస్టు 28 : ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య అందుతోందని నోడల్ అధికారి గాయత్రి అన్నారు. మండల కేంద్రంలోని సంత బజార్ పాఠశాలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రతీ తరగతికి వెళ్లి విద్యార్థులతో పుస్తకాలు చదివించారు. ప్రభుత్వం విద్యా పరంగా నిధులు కేటాయిస్తూ మెరుగైన విద్యను అందిస్తోంది విద్యార్థులు దీన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'కాగితాలకే పరిమితమైన రుణమాఫీ'

మరికల్, ఆగస్టు 28 : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అమలు చేస్తున్న రూ.రెండు లక్షల రుణమాఫీ కాగితాలకే పరిమితమైందని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బొదిగెల శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. వరంగల్ సభలో డిక్లరేషన్ ప్రకారం ప్రతీ రైతుకు రూ.రెండు లక్షల రుణమాఫీ ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రారంభమైన సోషల్ ఆడిట్ గ్రామ సభలు

ధన్వాడ, ఆగస్టు 28 : జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించి 14వ విడత సోషల్ ఆడిట్ గ్రామ సభలు మండలంలో ప్రారంభమైనట్లు ఏపీవో మొగులయ్య తెలిపారు. బుధవారం మండలంలోని కిష్టాపూర్, పాతపల్లి, గున్ముక్ల, గోటూర్, కొండ్రోన్‌పల్లి, మడిగెలముల్లయ్య తండా, కొండాపూర్‌లో సోషల్ ఆడిట్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ నెల 31న మంత్రోన్‌పల్లి, చర్లపల్లి, ఎంనోన్‌పల్లి, పాతతండా, దుడుగుతండా, తొల్లగుట్టతండాలో, సెప్టెంబరు ఒకటవ తేదీన రాంకిష్టాయ్యపల్లి, ధన్వాడ, కంసాన్‌పల్లి, మందిపల్లి గ్రామాల్లో సోషల్ ఆడిట్ గ్రామ సభలు నిర్వహిస్తామని తెలిపారు. ఆయా గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులు కూలీల సమక్షంలో సభ నిర్వహించడం జరుగుతుందన్నారు.

నేడు లక్ష బిల్వార్చన

మరికల్, ఆగస్టు 28 : మరికల్ పట్టణంలోని భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంలో గురువారం ఉదయం 10 గంటలకు లక్ష బిల్వార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వీరశైవ లింగాయత్ జిల్లా కార్యదర్శి లక్కాకుల శివకుమార్, పట్టణ అధ్యక్షుడు జగదీశ్వర్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గురువారం ఉదయం ఐదు గంటలకు వేద పండితుల మంత్రోచ్ఛరణలతో స్వామి వారికి మహాన్యాస పూర్వక, అభిషేకం, రుద్రాభిషేకంతో పాలు ప్రత్యేక పూజలు కొనసాగుతాయని తెలిపారు. అనంతరం 120 మంది దంపతులచే లక్ష బిల్వార్చన కార్యక్రమం ప్రారంభమవుతుంది. అనంతరం భక్తులకు అన్నదానం ఉంటుందని, ఈ కార్యక్రమానికి మండల, పట్టణ ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'చెరువును కాపాడాలి'

మరికల్, ఆగస్టు 28 : మండల కేంద్రంలో ధర్మన్నకుంట చెరువును కబ్జా నుంచి కాపాడాలని సీపీఐ నాయకుడు వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకుల అండదండలతో కొందరు వ్యక్తులు చెరువును ఆక్రయించి చెరువు మాది, పట్టా ఉందని అక్రమంగా రాత్రిరాత్రే టిప్పర్ల ద్వారా మొరం వేసి 75 శాతం చెరువును చదును చేశారని అన్నారు. మిగిలిన 25 శాతం నీటితో ఆయకట్టు రైతుల పంటలకు నీరు సరిపోకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టంలోని ధర్మన్నకుంట చెరువు కబ్జాకు గురికాకుండా ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వేసిన మొరం తొలగించి చెరువును పూర్తి స్థాయిలో నీరు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.